

# గంజాయి పట్టివేత

## • ఐదుగురు వ్యక్తులు అరెస్ట్

జయశంకర్ భూపాలపల్లి జూన్ 16(వుదయం జిల్లా ప్రతినిధి)
అక్రమంగా సరఫరా జరుగుతున్న గంజాయిని పట్టుకొని ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిసిఎస్ సీఐ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు అని తెలిపారు ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహేర్షిలను అదుపులోకి తీసుకుని విచారించగా. వారు ఇచ్చిన సమాచారంతో గంజాయి సరఫరా చేస్తున్న ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రొయ్యూరు గ్రామానికి చెందిన జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను కూడా అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి మొత్తం 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పర్వతగిరి తహసిల్దార్ కార్యాలయంలో పాము

## -సిబ్బందికి తప్పిన ప్రమాదం.





పర్వతగిరి , జూన్ 16 ( వుదయం ప్రతినిధి ) :పర్వతగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం స్వల్ప కలకలం చోటుచేసుకుంది. కార్యాలయాన్ని తెరవడానికి వచ్చిన వీఆర్ఏ కేదారి తలుపులు తెరవగానే లోపల పాము కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. పరిస్థితిని గమనించిన పాము కార్యాలయంలోని బీరువా కిందకు చేరుకుంది.
సమాచారం అందుకున్న కార్యాలయ సిబ్బంది, స్థానికులు అప్రమత్తమై పామును బయటకు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పాము మృతి చెందింది. కార్యాలయ సిబ్బందికి, వచ్చిన ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పుల్యాల గాంధీ



భూపాలపల్లి, జూన్ 16 (వుదయం ప్రతినిధి):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన పుల్యాల గాంధీ ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను మర్యాదపూర్వకంగా కలిశారు.?ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుల్యాల గాంధీ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన నాయకులకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన పదవికి పూర్తి న్యాయం చేస్తూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుడు శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి 10 లక్షలు ప్రభుత్వం చెల్లించాలి.

## మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్



పర్వతగిరి , జూన్ 16 ( వుదయం ప్రతినిధి ) :వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజక వర్గం పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ధోనికెలా శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి చని పోవడం జరిగింది.మృతుడు శ్రీనివాస్ గౌడ్ పార్థీహ దేహాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ సందర్శించి పూలమాల నివాళులు అర్పించారు.అనంతరం శ్రీనివాస్ గౌడ్ భార్య,కొడుకు,కూతురు లను మోకుదెబ్బ రమేష్ గౌడ్ పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నర్సంపేట మోకుదెబ్బ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ మర్ద సతీష్ గౌడ్,దౌలత్ నగర్ గౌడ సంఘం సర్పంచ్ పుల్లూరి సారయ్య గౌడ్,తీగల వీరాస్వామి గౌడ్,ధోనికెలా సదానందం గౌడ్,రమేష్ గౌడ్,సమ్మయ్యగౌడ్,సుధాకర్ గౌడ్,కుమార్ గౌడ్,రాజు గౌడ్,దయాకర్ గౌడ్,చిన్న సుధాకర్ గౌడ్,మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కృషితో

# నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ

## • సర్పంచ్ కు అభినందనలు తెలిపిన మండల ప్రజలు.



భూపాలపల్లి జూన్ 16 వుదయం ప్రతినిధి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల ప్రజలకు ప్రయాణికులకు మొగుళ్ళపల్లికి నైట్ హాల్ట్ బస్ రావాలనేది ఎన్నో సంవత్సరాల చిరకాల స్వప్నం. అలాంటి చిరకాల స్వప్నంను మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో. నైట్ హాల్ట్ బస్సును 15జూన్ సోమవారం రాత్రి 8:30కి పరకాల బస్ స్టాండ్ నుండి బస్ పునరుద్ధరించడం జరిగిందని. మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ మంగళవారం తెలిపారు. సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ మాట్లాడుతూ. మండల ప్రజలు వాణిజ్య వ్యాపార, విద్య ఉద్యోగ ఉపాధి కోసం వెల్లి స్వగ్రామానికి తిరిగి వచ్చేవారికి, రాత్రి వేళల్లో సరియైన బస్సు మార్గం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలకు అధిక ధరలను చెల్లించి నాన్న ఇబ్బందులు పడి గ్రామాలకు చేరుకునేవారని, మొగుళ్లపల్లి మండల కేంద్రానికి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి జమ్మికుంట రైల్వే స్టేషన్ ఉండి కూడా, సమయపాలనలో బస్సు మార్గం లేక రైలు మార్గాన్ని సద్వినియోగం చేసుకోలేక చిట్యాల టేకుమట్ల మొగులపల్లి మండలాలకు చెందిన వారు నాన్న ఇబ్బందులను ఎదుర్కొనేవారు ఇట్టి సమస్యను గమనించిన మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ మే 15 న పరకాల డిపో మేనేజర్ రాంప్రసాద్ ను సంప్రదించి ప్రజలు ప్రయాణికుల సమస్యను టీఎస్ ఆర్టిసి పరకాల డిపో మేనేజర్ కు సమస్యను విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రాంప్రసాద్ మొగులపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ కి నైట్ హాల్ట్ బస్సును జూన్ 15 సోమవారం రాత్రి 8:30కు పరకాల బస్టాండు నుండి పునరుద్దిస్తున్నామని సమాచారం అందించారు 8:30కు పరకాల నుండి బయలుదేరిన బస్సు, 9 గంటలకు మొగుళ్ళపల్లికి చేరుకుంది. మరుసటి ఉదయం 4:30 కు మొగుళ్లపల్లి నుండి బయలుదేరి జమ్మికుంటకు 5:15 చేరుకుంటుందని సర్పంచ్ మండల ప్రజలకు వివరించారు మండల కేంద్రానికి నైట్ హార్ట్ బస్సు రావడంతో పట్టణాలకు వెల్లే వాణిజ్య వ్యాపార రంగాలకు చెందినవారు, టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మూడు మండలాలకు చెందిన ప్రయాణికులు నైట్ హాల్టు బస్సు రావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, పున ప్రారంభించినందుకు గాను సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

# బడి బాట పడితే పన్నుల మాఫీ

## చౌటపల్లి గ్రామ పంచాయతీ అద్భుత తీర్మానం!

- పదో తరగతి టాపర్లకు రు.5,116/- నగదు బహుమతి
- చౌటపల్లి గ్రామ సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు,డ పాలకవర్గం అద్భుత నిర్ణయం




పర్వతగిరి , జూన్ 16 ( వుదయం ప్రతినిధి ) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను (అడ్మిషన్లను) పెంచడం మరియు విద్యను ప్రోత్సహించడమే ధ్యేయంగా వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, చౌటపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం (16-06-2026) రోజున చౌటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన, ఉప సర్పంచ్ పెసరి దర్గేష్ , వార్డు సభ్యుల సమక్షంలో అత్యవసర గ్రామపంచాయతీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రెండు ముఖ్యమైన ఏకగ్రీవ తీర్మానాలను ఆమోదించారు.

**కీలక తీర్మానాలు ఇవే:**

1. పన్నుల మినహాయింపు : చౌటపల్లి గ్రామంలోని "మండల ప్రాథమిక పాఠశాల" మరియు "జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల" లలో అడ్మిషన్ తీసుకుని, చదువుకునే విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు ఇంటి పన్ను మరియు నల్లా (వాటర్) పన్నును పూర్తిగా మినహాయిస్తున్నట్లు తీర్మానించారు.
2. ప్రతిభా పురస్కారాలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు (టాప్ 2 ర్యాంక్స్ ) సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గానూ వారికి ?5,116/- నగదు బహుమతిని అందించాలని నిర్ణయించారు.

సర్పంచ్ మట్టపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపు మాట్లాడుతూ
చౌటపల్లి "గ్రామంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.గ్రామస్తులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలను చౌటపల్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి పన్ను మినహాయింపులు మరియు బహుమతులు పొందాల్సిందిగా కోరారు.
ఈ సమావేశంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులైన చిడిమిల్ల అశోక్ , చామంతుల లక్ష్మి , మట్టపెల్లి నిఖిల్ , గౌరారపు నరసింహస్వామి , గౌరారాపు అయిలయ్య , నాతి నర్సమ్మ , రాజబోయిన అరుణ , చెన్నూరి సుభద్ర , శ్రీమతి దామెర రమ, గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోత్ అశోక్ నాయక్ పాల్గొన్నారు.

# రూ. కోట్ల విలువైన 163 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

- రెండు దశాబ్దాల నాటి అక్రమ 'పట్టా' రద్దు చేసిన కలెక్టర్
- బచ్చన్నపేట మండలం సల్వాపూర్ గ్రామంలో జిల్లా యంత్రాంగం చర్యలు



జనగామ, జూన్ 16 (వుదయం ప్రతినిధి) : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సల్వాపూర్ గ్రామంలో దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న రూ. కోట్ల విలువైన 163 ఎకరాల ప్రభుత్వ 'గైరాన్' (ప్రజా ఉమ్మడి) భూమిని జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకుంది. సర్వే నంబర్ 147 లోని మొత్తం 163 ఎకరాల 25 గుంటల భూమిని మంగళవారం అధికారులు భౌతికంగా స్వాధీనం చేసుకుని, తెలంగాణ ప్రభుత్వానికి పునరుద్ధరించారు. ప్రధానంగా ఆక్రమణలో ఉన్న 84 ఎకరాల భూమిని వివరణాత్మక పంచనామా ద్వారా స్వాధీన పరుచుకున్నారు.
అక్రమాల పరంపర ఇలా..
జిల్లా యంత్రాంగం జరిపిన సమగ్ర విచారణలో ఈ భూమికి సంబంధించిన అక్రమాలు వెలుగుచూశాయి.
మూలాధార సెటిల్‌మెంట్ రికార్డు (సేత్వార్) ప్రకారం 'గైరాన్' భూమిగా ఉంటూ, నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న ఈ భూమిని.. ఎలాంటి హక్కులు లేని వ్యక్తులు తప్పుడు రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజుల ద్వారా చేజిక్కించుకున్నారు. అధికార దుర్వినియోగం: వీటి ఆధారంగా గతంలో మ్యుటేషన్లు చేసి, పట్టాదారు పాస్‌బుక్‌లు పొందారు. ఆ తర్వాత దీనికి చట్టబద్ధత కల్పించేలా అప్పటి కలెక్టరేట్ అధికారి ఒకరు హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, తన అధికార పరిధిని దాటి ఈ గైరాన్ భూమిని ప్రైవేటు 'పట్టా' భూమిగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నియమ నిబంధనలకు విరుద్ధం: గైరాన్ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే అధికారం ఏ కలెక్టర్‌కూ లేకపోయినా, ఆ ఉత్తర్వు ద్వారా భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించి, వ్యవసాయేతర అవసరాలకు మార్చేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లింది.?కలెక్టర్ తాజా ఉత్తర్వులు – భూమి పునరుద్ధరణ గౌరవ హైకోర్టు రిమాండ్ ఆదేశాల మేరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ ప్రతి మూలాధార, సర్వే రికార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. దావాదారులకు విచారణకు పూర్తి అవకాశం కల్పించిన అనంతరం, ఒక వివరణాత్మక సహేతుక ఉత్తర్వు ద్వారా ఈ భూమిని తిరిగి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఈ తాజా ఉత్తర్వులతో గతంలో జరిగిన అమ్మకపు దస్తావేజులు, మ్యుటేషన్లు, పాస్‌బుక్‌లు మొదటి నుంచీ చెల్లనివిగా మారాయి. అక్రమ పట్టా రద్దు కావడంతో పాటు, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ROR) సరిదిద్దబడింది. ఈ సర్వే నంబరును తిరిగి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చి, ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా నిలిపివేశారు.

# టియుఎంహెచ్ఇయు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జె. సుధాకర్ నియామకం



హనుమకొండ టౌన్, జూన్ 16 (వుదయం ప్రతినిధి) : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ఫసియుద్దీన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హనుమకొండ జిల్లాకు చెందిన సుధాకర్ ను నూతన రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా జె. సుధాకర్ ను నియమించారు. అనంతరం యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె. యాద నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జె. సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా కె. సరోజ, ఎండి. అతిక్, ఎన్. సుమన్, ఆర్. శ్రీనాథ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జె. సుధాకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగుల హక్కుల సాధన కోసం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. సుధాకర్ నియామకం పట్ల యూనియన్ నాయకులు, తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

చిట్యాల జూన్ 16(వుదయం ప్రతినిధి) చిట్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఈఓ కోడెపాక రఘుపతి కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ , 4 వ వార్డ్ సభ్యులు తౌటం నవీన్ ,ఉపాధ్యాయులు (బుర్ర సదయ్య,శ్రీనివాస్,కల్పన,విజయ లక్ష్మి,రాజమౌళి ,రాంనారాయణ,శంకర్,ఉస్మాన్ ),పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై ను సన్మానించిన వర్తక వ్యాపార సంఘం సభ్యులు





మహాదేవపూర్ జూన్ 16(వుదయం ప్రతినిధి)
మహదేపూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సాంబమూర్తి కు మంగళవారం మహాదేవపూర్ వర్తక వ్యాపార సంఘం నాయకులు సభ్యులు సన్మానించారు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్లో ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో వర్తక సంఘం మండల అధ్యక్షుడు చిర్ల సాంబశివ రెడ్డి, సంఘం నాయకులు ఇమ్మడి జగదీష్, నర్సిన కృష్ణ, నర్సిన వేణు గోపాల్, ఎండీ నయీమొద్దీన్,తోపాటు సభ్యులు పాల్గొన్నారు.

# మైలారం గ్రామ ఉమామహేశ్వర స్వామి దేవాలయం కమిటీ ఎన్నిక



శాయంపేట16 (వుదయం దినపత్రిక)
శాయంపేట మండల కేంద్రంలోని మైలారం గ్రామంలో ఉన్న పురాతన దేవాలయ శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా జూలూరి చంద్రశేఖర్ అధ్యక్షులుగా రంగు శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా మామిడిపెల్లి సాంబయ్య జోగి రెడ్డి ప్రధాన కార్యదర్శిగా దూదిపాల రాంరెడ్డి నూనె శ్రీనివాస్ కోశాధికారిగా బత్తిని తిరుపతి సలహాదారునిగా సలేంద్ర రవీంద్ర చారి మరియు కార్యవర్గ సభ్యులుఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామస్తులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# ఈ నెల 20న ఉచిత వాస్కులర్ వైద్య శిబిరం

## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : డాక్టర్ పింగిలి విజయపాల్ రెడ్డి.



పరకాల, జూన్ 16: (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఉన్న లక్ష్మీ నర్సింగ్ హోమ్‌లో ఈ నెల 20వ తేదీ శనివారం ఉచిత వాస్కులర్ (రక్తనాళాల) వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ పింగిలి విజయపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తనాళాలకు సంబంధించిన వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి నిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వరికోస్ వెయిన్స్ (రక్తనాళాల వాపు) సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కాళ్లు బరువుగా అనిపించడం, కాళ్ల నొప్పులు, ఉబ్బిన నరాలు కనిపించడం, గాయాలు లేదా పుండ్లు త్వరగా మానకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. "ఆరోగ్యకరమైన రక్తనాళాలు –– ఆరోగ్యకరమైన జీవితం" అనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, పరకాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయపాల్ రెడ్డి కోరారు.
శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 81063 67888 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

